# దర్గామిట్ట కతలు

'యొ్యా! మాబ్బాషా' అంటా కేకేసినాను రేకు తలువు బయట్నే నిలబడి.

'ఎవురా?' అన్నాడు మాబ్బాష (మహబూబ్ + బాష) లోపలి నుంచే.

'నేను. కరీం భాయ్ కొడుకుని. రేవూ తలకాయ కాళ్లు కావాలంట. మా నాయిన నీకు చెప్పేసి రమ్మని పంపించినాడు' అన్నాను పెద్దగా.

కాస్త తాలినాక మాసిపోయిన ఎర్రటి సిల్కు లుంగీని పొట్ట మీదికి కట్టుకుంటా బయటికి వచ్చినాడు మాబ్బాష.

'తలకాయా కాళ్లకయితే అవ్వలా. డబ్బులిస్తేనే ఇస్తానని చెప్పు మీ నాయినకి' అన్నాడు, డిమాండింగుగా.

'వాడమ్మా బడవా' అని మనసులో అనుకొని– 'అట్లాగే చెప్తాను గానీ నువు మాత్రం మర్చిపోయి యింకొకరికి యియ్యొబాక' అన్నాను, అణ్ణుంచి వొచ్చేయబోతా.

'ఒక తలకాయ. నాలుగు కాళ్లు. మొత్తం కలిపి నలభై రూపాయలన్నానని చెప్పు' అంటా రేటు కూడా చెప్పేసినాడు మాబ్బాష, నా వెనకనే కేకేస్తా.

యింక రొంతసేపు తాలితే 'ముందే డబ్బులు కట్టేసిపో' అంటాడేమోనని బయమేసి గబగబా ఆడు గ్నులేసినాను యింటి తట్టు.

యిష్టాలయం యీదిలో వారానికి ఆరు రోజుల పాటు కంసాలి పని చేసుకునే మాబ్బాష ఆదివారం రోజు మాత్రం అర్కాటు నవాబుతో సమానం చుట్టుపక్కల వాళ్ళకి.

తక్కిన ఆరురోజుల్లా గాకుండా ఆ రోజన్నా ఎగస్ట్రాగా నాలుగు డబ్బులు సంపాదిద్దామని చెప్పి (పాపం ఆ మనిషికి అందరూ ఆడపిలకాయలే) పొట్టేల్ని కోసి చుట్టుపక్కల వీదిలోళ్లందరికీ మావుసం అమ్మతాడు మాబ్బాష. ఆయన అమ్మే మావుసం కోసరం, ఆయన కోసే పొట్టేలు తలకాయ కోసరం శనివారం సాయింత్రం నుంచే ఆర్డర్లు, ఆదివారం పొద్దుటి నుంచే ఎగబడి పోవడం మొదలయి పోతుంది మాబ్బాష ఇంట్లో.

మా వూరి ట్రంకు రోడ్డులోని మావుసం మార్కెట్టులో ఒకటికి ఆరు మావుసం అంగళ్లున్నా మాబ్బాష మావుసానికే ఎందుకంత డిమాండింగంటే దానికి రెండు కారణాలుండాయి.

ఒకటి: ఆదివారవ్వూట అలివిగాని యాపారం జరగద్ది కాబట్టి ఆరోజు మార్కెట్లో పొట్టేల్ని కోసి యేలాడదీస్తారో, పొట్టేళ్ల మద్యన గొర్రెని కోసి యేలాడాదీస్తారో నరమానవుడు కూడా కనిపెట్ట లేడు కాబట్టి నమ్మకమైన మావుసం కోసరం (కళ్లెదురుగ్గానే కోస్తాడు గదా) మాబ్బాష కాడికి వస్తారంతా.

రెండు: ఇది అప్పు బేరం. అంటే ఎమ్మట్నే డబ్బులీ బళ్లా. ఆదివారం రోజు మావుసం యిచ్చినాక నాలుగురోజులు గడువిచ్చి శుక్కురోరం రోజు మాబ్బాషే వస్తాడు యింటింటికీ. యీ లోపల మనం డబ్బులు రెడీ చేసి పెట్టుకోవాలి. లాకుంటే మరుసటి వారం నుంచి మావుసం కట్. తలకాయ కట్.

యీడ మాబ్బాష డిమాండు యిట్టా ఉంది గదా. యింటికాడ మా అమ్మ డిమాండు యింకో విదంగా ఉంటుంది– తలకాయ కూరంటే.

'తలకాయ కూరంటే సచ్చే సావు సామీ. యీ ఆదివారానికి మావుసమే తెచ్చుకుందాములే' అంటుంది మా అమ్మ– మా నాయిన కోరిక మీద కావాలని మనకది చావ్సు గదా!

'ఫష్టోకి రూపాయిస్తే రెడీ' అంటాను నేను చిటికేస్తా.

'అట్నేపో. శాంక్షన్' అంటాడు మా నాయిన, ఎమ్మట్నే దర్మపబువులా మొకం పెడతా.

సినిమాకి నేల డబ్బులు వస్తాయనిగానీ లాకుంటే తలకాయ కూరతో నిజ్జంగానే బలే తలకాయనొప్పబ్బా! బలే చాకరీ!

అసలు తలకాయ కోసరం మాబ్బాషను చేరుకునే దానికే పెద్ద యుద్దం చెయ్యాలి పస్టు.

ముక్కలు కొట్టిన మావుసాన్నంతా ఆయన కేజీ, అరకేజీ, పావుకేజీ కుప్పలుగా సర్దుకుంటా, ఉండ

## తలకాయ కూరతో బలే తలకాయనొప్పబ్బా!



నీళ్లుబోస్తా.

తలకాయ కూర తినాలని అప్పటికే మనసులో పడిపోయిన మా నాయిన మా అమ్మ వాటం కనిపెట్టి బలేగారంగా యాక్షను చేస్తాడు కాసేపు.

'యీ సారికిట్టా కానియ్యి అమ్మలాల. నీ మాడల్లో తలకాయ కూర వొండేవాళ్లు మా అమ్మతో సహా కావలి మొత్తమ్మీద ఎవరూ లేకగానీ లాకుంటే నిన్నెందుకు అడగతాను బంగారా' అని మా అమ్మని పొగడతా మెల్లగా దోవలో పెట్టబోతాడు.

'నా వల్ల కాదు నాయిన. నువ్వేమో లేవవు. పెద్దోడేమో యివడు. పొద్దున్నే లేచి నేనుపోయి తెచ్చేదా తలకాయ?' అంటుంది మా అమ్మ, మా నాయిన చేత యింకాస్త బతిమిలాడిచ్చుకునే దానికి.

'నీకదంతా బళ్లేదు అమ్మలాల. తలకాయ తీసకొచ్చి చేరేసే పూచీ నాది. 'ఏమిరా?' అంటాడు మా నాయిన– నువ్వు తీసకొస్తావు గదా అన్నట్టు.

గానే కూరకొచ్చిన ఆడోళ్లు, మొగోళ్లు ఖాళీ టిపెను క్యారేజీ గిన్నెల్ని మాబ్బాష మొఖం చుట్టూ ఆడిస్తా 'నాకియ్యొ మాబ్బాషా, నేను పోవాలి మాబ్బాషా, యొ్యాయొ్యా మాబ్బాషా' అంటా ఊపిరాడనీకుండా చేసేస్తారు మాబ్బాషకి.

మావుసం అయిపోయే కొద్దీ యీళ్ల గీ...బా...ఎట్టా ఉంటుందంటే ఒక్కదెబ్బతో తక్కెడ అవతల పారేసి, పొట్ట మీదకి లుంగీ లాక్కుంటా లేచి నిలబడేస్తాడు మాబ్బాష.

'మీ పోదు పడటం నావల్ల కాదు గానీ మీరే తీసకెళ్ళండమ్మా... తీసకెళ్లండి' అంటాడు, బతకడానికి రొంత గాలి పీల్చుకుంటా.

అప్పుడందరూ గమ్మునయిపోతారు. మళ్లా ఆయన తక్కెడ పట్టుకోంగానే 'యొ్యా మాబ్బాషా, యొ్యాయొ్యా మాబ్బాషా' కేకలు షురూ!

అట్టాంటి రావందాడిలో అరిచి, గిల్లి గిచ్చి మాబ్బాష

కాణ్ణుంచి తలకాయ, కాళ్లు రాబట్టుకోవాలి మనం. వాటిని బుట్టలో ఏసుకొని మోసుకుంటా యింటికి చేరుకునే సరికి మా అమ్మ అనుమానం కళ్లతో, మా నాయిన హుషారు మొకంతో వస్తారు తలకాయను చూడ్డానికి.

'ముదురుగుంది గదా' అంటుంది మా అమ్మ, ఏదో ఒకటి అనాలి గదా అన్నట్టుగా.

'యాడ ముదురా? కొమ్ములు కూడా రాకపోతే?' అంటాడు మా నాయిన, మా అమ్మ మాటల్ని వాలనీయకుండా.

'నలభై రూపాయలని యదాన కొట్టుకున్నట్టున్నాడు మాబ్బాషా గాడు. చూడు ఎంత చిన్నంగుందో తల కాయ. కేజీ అన్నా పడుతుందా' అంటుంది మా అమ్మ మళ్లా.

'ఏమి కేజీ తల్లా. మొయ్యలాక చెయ్యి పడిపోతే' అంటాను నేను, యాడ వాపసిచ్చేసి రమ్మంటుందోనని బయం పుట్టి.

'మీ అబ్బా కొడుకులదేం పోయింది కానియ్యండి. నాయినా... ముందర నువ్వు పోయి కాల్పించుకొని రాబో' అంటుంది మా అమ్మ, నాతో.

యింకాణ్ణుంచి బుట్టెత్తుకొని ఎంకటేశ్వరా హాలు కాడ కొలిమినోళ్ల దగ్గరికి పోవాలి, తలకాయ కాళ్లని కాల్పించుకొని రావడానికి. అప్పటికే ఆడ కొలిమికిద్దరుంటారు నాబోటోళ్లు.

నేను వాడికీగా వెళ్లే కొలిమిలోని మొగుడూ పెళ్లాలు తలకాయని కాల్చే పద్దతి బలే సొగసుగా ఉంటుంది చూడ్డానికి. నిప్పుల ముందర మొగాయన కూచొని, తలకాయకి ఎనకపక్క సువ్వ గుచ్చి, దానిని అటూ ఇటూ కదపతా సెగ తగిలిస్తా ఉంటే– ఆడామె మర మిషను కాడ కూచొని గాలి తిప్పతా, మంటకి బొగ్గులందిస్తా ఉంటుంది మొగాయనకి.

నిప్పుల సెగకి తలకాయ మీదుండే నూగు చిట పటమని మాడతా ఉంటే, టైము గడిచే కొద్దీ కొలిమి కొట్టం అంతా కమ్మటి వాసన! (అసలు ఆ వాసనకే వేసెయ్యొచ్చు తలకాయ కూరకి నూటికి నూరు మార్కులు. కొందరు తిక్కలాళ్లు ఎంతసేపటికీ పొట్టేలు మాంసం, గుండెకాయ తింటావుంటారుగానీ తలకాయ కూర ఎట్టుంటుందో రుచి చూసి సస్తేగదా).

తలకాయని కాల్చడం అంటే ఉత్త కాల్చడంతోటే పనయిపోదు. దాని ముక్కులోపల, చెవుల లోపల ఏవైనా సూక్ష్మజీవులు లాకుండా వాతలు కూడా పెట్టాలి. అందువల్ల తలకాయ బాగా కాలినాక ఒక సువ్వని ఎర్రగా కాల్చి ముక్కు కన్నాల్లోకి, చెవి కన్నాల్లోకి కచ కచమని దూరస్తాడు మొగాయన. అనేక కాళ్ల గిట్టెల మీద సుత్తి దెబ్బలేసి, గోర్లు ఎగరగొట్టి, గిట్టల నడుమ కూడా నీటుగా వాతలు పెడ్తాడు. ఈ మొత్తం పనికి రెండు రూపాయిలు చార్జీ!

కాల్చిన తలకాయ, కాళ్లని యింటికి తెచ్చినాక మా అమ్మకింక కడిగే పని. వాటిని నీళ్లుబోసి కడిగి, కత్తి తీసుకొని గిరి గీకి తెల్లంగా చేస్తుంది గానీ తలకాయని పగలగొట్టి ముక్కలు చెయ్యడం మా అమ్మకు చేతకాదు.

నిజ్జానికి కూడా తలకాయని నైనుగా పగలగొట్టి, దానిలోని మెదణ్ణి బద్రంగా తీసి పక్కనబెట్టి, పళ్లూ దవడెముకలూ అవతల పారేసి, నాలిక మీద తెట్టు గీకేసుకొని, తక్కిన మాంసాన్నంతా కుదురుగ్గా ముక్కలు కొట్టుకోవడం పెద్దకళ!

ఈ కళలో మా యిళ్ల మొత్తానికి మాపెదమ్మ ఘనాపాటి.

'నేను పోయి పిలిస్తే రాదు గానీ నువు పోయి పిలూపో. మాంసం చేసిస్తది' అంటుంది మా అమ్మ తలకాయని కడిగేసినాక మా నాయినతో.

మా నాయినంతటోడెళ్లి మాంసం చేసియ్యడానికి రమ్మంటే, రానుపో అనడం మరేదగా ఉండదు గదా... అందువల్ల తప్పనిసరయ్యి వచ్చి మా సిమెంటు తొట్టి కాడ కూచుంటుంది మా పెదమ్మ.



యింకామెకు మా నాయినొక అసిస్టెంటు. మా అమ్మొక అసిస్టెంటు.

మొద్దు కత్తితో 'టపా టపా' మని మా పెదమ్మ తలకాయ ముక్కలు కొడతా ఉంటే, ఎర్రటి నలు సులెగిరి మొకాన నోట్లో పడతా ఉంటాయి విసురుకి.

'పొదు పనమ్మా యిదా' అంటానే ఎట్నో పని ముగిస్తుంది మా పెదమ్మ.

అంతా అయినాక నాలిక ముక్కలతో సహా మాంసం మొత్తాన్ని దబర్లోకి ఎత్తుకుంటా 'కాసేపు ఉండరాదకా. కూర తీసుకొని పోదూ గానీ' అంటుంది మా అమ్మ, మాటవరసకి.

'వద్దులే అమ్మా. నాకు పనుంది' అంటుంది మా పెదమ్మ, నేను వెళ్లిపోయినా నువ్వు యింటికి కూర పంపిస్తావు గదా అన్నట్టుగా.

మా అమ్మ అదే చాన్సనుకొని 'సరేలే పో అయితే. మీ యింట్లో కూడా మాంసమో పొట్ట పేగులో తెచ్చుకోనుంటారు గదా. ఆ నీను ఈ నీను ఎక్కు వైపోద్దిలే కూర పంపితే' అంటుంది, మా పెదమ్మకు ఏ మాత్రం తలకాయ కూర ఆశ మిగిల్చకుండా.

ఆ దెబ్బకు మొకం నల్లంగా పెట్టుకొని 'యీసారి పిలూ చెప్తా' అన్నట్టుగా వెళ్లిపోతుంది మా పెదమ్మ.

ఆమెనట్టా వెళ్లనిచ్చి, పొయ్యి మీదకు కూర దబర ఎక్కిస్తుంది మా అమ్మ! యింక చూడూ– మారిన వచ్చి కొబ్బరి, టమేటాలు, లోంగా చెక్కా, అల్లం మసాల ఒక్కొక్కటి పడేకొద్దీ ఇంట్లో ఒక్కో రకమైన కమ్మటి వాసన.

ఒక్కో వాసన ముక్కుకి తగిలేకొద్ది 'డడడా' అంటా రాగాలు తీస్తా, చేతులు ఎనక్కి కట్టుకొని అటూ ఇటూ తిరగతా ఉంటాడు మా నాయిన.

మద్య మద్యలో 'ముక్క ఉడికిందేమో చూసేదా?' అంటా ఉంటాడు వచ్చి.

మా నాయిన మాటకి మా అమ్మ బదులైనా చెప్ప కుండా కూర మొత్తం ఉడికినాక, ఉప్పు చూసుకొని, అనిరి వదిలి, దబరను కిందకు దించేసి అదే చేత్తో బాండిలిని పొయ్యెక్కిస్తుంది.

రొంతంటే రొంత మాంసె, రొంతంటే రొంతే మాపాల ఏసి దోర దోరగా మెదణ్ణి వేయించి దాన్ని కూడా మూడు నిమిషాల్లో కిందకి దించేస్తుంది! (ఈ పని తలకాయ కూరకి ముందరే ఎందుకు చెయ్యదంటే చల్లారితే బ్రెయిన్ ఫ్రయ్యి బాగుండదు).

యిప్పుడు ఒకతట్టు తలకాయ కూర!

యింకోతట్టు బ్రెయిన్ ఫ్రెయ్యి!

ఆ రెండింటినీ రెండు కళ్లతో చూసుకోంగానే మా అమ్మ ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా 'పొద్దునపంగా పొళ్లు తోమినావనే గాని నాష్టా కూడా చేయకుండా ఈ చాకిరిలో పడినాను. ఆకలేస్తోంది తల్లా' అంటా పళ్లెం అందుకుంటుంది, ఏదో ఒకటి గతిలాక తినాలి కదా అన్నట్టుగా యాక్షను చేస్తా.

'కాసేపు తాలేవాణ్ణే గాని అవతల మోటారు పని ఉంది సామి. అర్జెంటుగా ఎళ్లి పోవాలి' అంటా యింకో పళ్ళెం అందుకుంటాడు మా నాయిన, ఎట్టా తిన్నాక కమ్మగా నిద్దరేస్తాడని మా అందరికీ తెలిసినా.

'ఆడ తిరిగి యీడ తిరిగి తలకాయ నొప్పి. ఆకలి' అంటా నేను కూడా సందు చేసుకుంటాను.

'ఏదా... ఉప్పెట్టా ఉందో చూణ్ణే' అంటా మా నాయినమ్మొస్తుంది సైగ్గా.

అనేక మా అన్న, మా చెల్లెలు, మా తమ్ముడు... లైను!

చేతికి జిడ్డు పట్టేంత కొవ్వుండే– అమృతం రుచి కలిగిన నలనల్లటి ముక్కలుండే తలకాయ కూరని వేడి వేడి అన్నంలో కలుపుకొని చేతికీ నోటికీ లాగిస్తా ఉంటే అంతదాకా పడిన తలకాయ నొప్పి, నీను చాకిరీ ఎగిరిపోయి ఆ పూట లోకం బలే సుభిక్షంగా ఉన్నట్టు అనిపిస్తుందబ్బా!

–మహమ్మద్ ఖదీర్‌బాబు